క్లుప్తంగా

విద్యార్థినులకు నగదు ప్రోత్సాహం


నగదు అందజేస్తున్న భీమిరెడ్డి

మంత్రాలయం/మంత్రాలయం రూరల్: ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం చిలకలడోణ కస్తూర్బా పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులకు నగదు ప్రోత్సాహాన్ని మండల కన్వీనర్ భీమిరెడ్డి, జనార్దన్‌రెడ్డి సోమవారం అందజేశారు. కె.మేఘన(487)కు రూ.3వేలు, ప్రమీలా రాణి(482)కు రూ.2 వేల నగదు అందజేసి శాలువా కప్పి సన్మానించారు. మంత్రాలయం సర్పంచ్ భీమయ్య, సచివాలయం కో కన్వీనర్ వీకేసీ రఘు, ఆచారి, వెంకటరెడ్డి, ఎస్‌ఓ శాంతి ఉన్నారు.

ఈరన్నస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఈరన్న స్వామి

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామికి సోమవారం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల రాకతో క్షేత్రం పరిసరాలు కిటకిటలాడాయి. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహా మంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టి ఫల,పుష్పాలతో ఆలంకరించారు. కొందరు భక్తులు ఆలయ పరిసరాల్లో పిండి వంటలు వండి స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు


పత్తి, కంది విత్తే విధానాన్ని పరిశీలిస్తున్న ఏఓ శేషాద్రి

కౌతాళం: పంట మార్పిడితోక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి శేషాద్రి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఒకే పొలంలో రైతులు పత్తి విత్తనాలతో పాటు అంతర పంటగా కందులు సాగు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అంతర్ పంట విధానాన్ని ప్రోత్సహిస్తుందని చెప్పారు. పత్తితో పాటు జొన్న, కందులు, సజ్జ, కొర్రలు వంటి పంటలను సాగుచేసుకోవడానికి రైతులు ముందుకు రావాలని కోరారు. సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని, అధిక మోతాదులో ఎరువులు, పురుగు మందులు వాడకాన్ని తగ్గించాలని చెప్పారు. చిరు ధాన్యాల పంటల సాగుతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చాన్నారు.

తీరిన దారి కష్టాలు


పాఠశాల దారిలో గ్రావెల్ వేసి చదును చేసిన దృశ్యం

కౌతాళం: స్థానిక ఉర్దూ పాఠశాలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు సురక్షితంగా వెళ్లేందుకు గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఇంతకుముందు పాఠశాలకు వెళ్లలంటే వర్షం నీటితో పాటు మురుగు నీటిలో దిగి వెళ్లాల్సి వస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. దీంతో గ్రావెల్ రోడ్డు వేయాలని ఎంఈఓ శోభరాణి సూచించడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం వారు గ్రావెల్ తోలించారు. దీంతో విద్యార్థుల రాకపోకలకు అవస్థలు తప్పాయి.

జయప్రదం చేయండి

ఆదోనిరూరల్: ఈనెల 26వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జిల్లా సమగ్రాభివృద్ధికి ఆదోని నుంచి కర్నూలు వరకు సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టే మహాపాదయాత్రను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, వెంకటేశులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్ల నిధులు కేటాయించాలన్నారు. ప్రాజెక్టులు పూర్తి చేయాలని. హంద్రీనీవా ద్వారా 106 చెరువులకు నీరు నింపాలని, జిల్లా యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమలు స్థాపించాలన్నారు. సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, రామాంజనేయులు, వీరేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్ట్

వెల్దుర్తి: పట్టణానికి చెందిన నలుగురు సారా విక్రేతలను సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. తాము జరిపిన దాడుల్లో పట్టణ సమీప ఎల్లమ్మ గుడి వద్ద రామానాయుడు, రామకృష్ణ, మద్దిలేటి, వెంకటేశ్వర్లు నుంచి 25 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

బాలలకు బలవర్ధక ఆహారం

- ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక మెనూతో మధ్యాహ్న భోజనం
- రోజూ ఒక రకం ఆహారంతో మెనూ
- పిల్లల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- హర్షం వ్యక్తం చేస్తున్న చిన్నారులు, తల్లిదండ్రులు


ఆదోని మున్సిపల్ హైస్కూల్ పిల్లలకు భోజనం వడ్డిస్తున్న వంట నిర్వాహకురాలు


విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఉడికించిన కోడిగుడ్లు

ఆదోని సెంట్రల్: పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు ప్రభుత్వం నాణ్యమైన పోషకాలతో కూడిన మధ్యాహ్నం భోజనం అందిస్తోంది. పిల్లల ఆకలి బాధ నుంచి విముక్తి కల్పిస్తూ వారికి పౌష్టికాహారం అందిస్తోంది. ఈ పథకం వల్ల పిల్లలను బడికి రప్పించడమే గాకుండా వారు ఆరోగ్యంగా ఉండేలా కృషి చేస్తోంది. పిల్లలకు విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 'జగనన్న గోరుముద్ద' పథకానికి శ్రీకారం చుట్టింది.

ఆదోని పట్టణం, గ్రామీణ ప్రాంతంలో 126 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అయా పాఠశాలలో 29,697 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ బడులలో చదువుతున్న విద్యార్థులకు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తోంది. విద్యా కానుకలో భాగంగా దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూలు, టై, బెల్టు, బ్యాగు తదితర సామగ్రి అందిస్తోంది. 'జగనన్న గోరుముద్ద' పేరుతో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తోంది. గతంలో ఒక పిల్లాడికి 1వ తరగతి నుంచి 5వ తరగతి చదివే విద్యార్థులకు రూ.3.59, 6వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు రూ.6.51 ఇచ్చేవారు. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వంట ఖర్చులను పెంచింది. పెంచిన వంట ఖర్చు మేరకు ఒక బాలుడికి 1వ తరగతి నుంచి 6 వ తరగతి వరకు రూ.5.88, 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.8.57 చొప్పున వంట నిర్వాహకులకు అందిస్తోంది.

భోజనంతో పాటు చిక్కీ, గుడ్డు

ప్రభుత్వం రోజుకు ఒక రకం భోజనంతో పాటు అదనంగా వేరుశనగ చిక్కీలు, ఉడకబెట్టిన గుడ్డు, రాగి జావ వంటివి విద్యార్థులకు అందిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో పిల్లలకు భోజనాలు పెట్టడానికి వంట ఏజెన్సీ వారు నానాతంటాలు పడేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. వంట ఖర్చులుగానీ, వంట చేసేవారికి గౌరవ వేతనం ప్రతి నెలా వారి ఖాతాలో జమ అవుతోంది. గతంలో వంట నిర్వాహకులు నెలల తరబడి గౌరవ వేతనం కోసం తిరిగిన సందర్భాలు ఉన్నాయి. పేద ప్రజలు కష్టాలను ఎరిగిన ప్రభుత్వం ఎప్పటికప్పుడు వారి సమస్యలను పరిష్కరిస్తోంది.

మధ్యాహ్న భోజనం మెనూ ఇలా

సోమవారం: హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు లేదా కురగాయాల పలావ్, కోడి గుడ్డు కూర, చిక్కీ
మంగళవారం: చింతపండు లేదా నిమ్మకాయ పులిహోర, టమాటా పచ్చడి లేదా దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు
బుధవారం: కురగాయల అన్నం, బంగాళదుంప కుర్మ, ఉడికించిన గుడ్డు, చిక్కీ
గురువారం: సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు
శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, గుడ్డు, చిక్కీ
శనివారం: ఆకుకూర అన్నం, పప్పుచారు లేదా తీపి పొంగలి

భోజనం బాగుంటోంది



పాఠశాలలో రోజూ ఒక రకం ఆహారం అందిస్తున్నారు. అన్నం, పప్పు కాయకూరలు, ఆకుకూరలతో భోజనం తయారు తోచేస్తున్నారు. దీనికి తోడు ఉదయం రాగి జావ, మధ్యాహ్నం భోజనంతో పాటు చిక్కీలు, ఉడకబెట్టిన కోడిగుడ్డు అందిస్తున్నారు. భోజనం రుచికరంగా ఉంటోంది. మధ్యాహ్నం ఇంటికి వెళ్లకుండా అందరం ఇక్కడే భోజనం చేస్తాం. – పి.రాధిక, విద్యార్థి

గౌరవ వేతనం అందుతోంది



ప్రతి నెలా గౌరవ వేతనం రూ.3000 చొప్పున నేరుగా మా అకౌంట్లో జమ చేస్తున్నారు. ఇప్పటివరకు పెండింగ్ పెట్టలేదు. ఏ నెలకు ఆ నెలలోనే వేతనం వస్తుంది. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకొని వంట ఖర్చులను పెంచడం సంతోషంగా ఉంది. – సరస్వతి, వంట నిర్వాహకురాలు, సాదాపురం పాఠశాల

మెనూ ప్రకారం అందిస్తున్నాం



ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. వంట నిర్వాహకులు నాణ్యత పాటించేలా భోజన తయారీని రోజూ ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తారు. విద్యార్థులకు భోజనం వడ్డించే వరకు అన్ని జాగ్రతలు తీసుకుంటారు. రోజుకు ఒక రకం కూరలతో ఆహారం అందించడం వల్ల విద్యార్థులు ఇష్టంగా తింటున్నారు. – మల్లికార్జున, ప్రధానోపాధ్యాయుడు, ఆదోని పురపాలక ఉన్నత పాఠశాల

కర్ణాటక మద్యం స్వాధీనం

పెద్దకడబూరు: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మహేష్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కల్లుకుంట గ్రామానికి చెందిన శ్రీనివాసులు అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్నాడనే సమాచారం మేరకు ఆయనపై నిఘా పెట్టామన్నారు. సోమవారం అదే గ్రామ సమీపంలోని నబిసాబ్ దర్గా దగ్గర కర్ణాటక మద్యంతో పట్టుబడ్డాడు. ఆయన నుంచి 95 కర్ణాటక 90ఎంఎల్ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మద్యం విక్రేతల అరెస్ట్

ఆదోనిరూరల్: అక్రమంగా కర్ణాటక మద్యం రవాణా, విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు సోమవారం ఇస్వీ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. పెద్దతుంబళం గ్రామానికి చెందిన సునీల్, గణేష్ ఏపీ 25 హెచ్ 1440 నంబర్ గల బైకుపై 26 ఒరిజినల్ ఛాయిస్ (90 ఎంఎల్), రెండు ఫుల్ బాటిళ్లు తీసుకొస్తుండగా మదిరె బస్టాప్ వద్ద పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అలాగే పెసలబండ గ్రామానికి చెందిన వడ్డే మహాదేవ తన ఇంటి వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా పట్టుకొని 26 ఓసీ టెట్రా ప్యాకెట్లను (90 ఎంఎల్) స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే కపటి గ్రామంలో గోవర్ధన్ అనే వ్యక్తి నుంచి 18 టెట్రా ప్యాకెట్లను (90 ఎంఎల్) అమ్ముతుండగా పట్టుకున్నట్లు చెప్పారు. నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

ఇద్దరు జనసేన కార్యకర్తలే...

పెద్దతుంబళం గ్రామానికి చెందిన గణేష్, సునీల్ జనసేన కార్యకర్తలుగా కొనసాగుతున్నారు. అక్రమార్జనే ధ్యేయంగా పార్టీని అడ్డు పెట్టుకొని కర్ణాటక మద్యం తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది.

అర్జీలను సత్వరం పరిష్కరించండి


స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తపరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పాల్గొని డివిజన్‌లోని అయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మండలంలోని ఆయా శాఖల అధికారులకు సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు.

స్పందనలో అర్జీల ద్వారా వచ్చిన సమస్యల్లో కొన్ని..

- ఆదోని మండలం ఇస్వీ గ్రామానికి చెందిన గొల్ల నారాయణకు సర్వే నంబర్ 28, 43ఏలో 8 ఎకరాల భూమి ఉందని, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో 7.07 ఎకరాలు మాత్రమే నమోదు చేశారని మిగతా 93 సెంట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.
- ఆదోని మండలం మదిరె గ్రామానికి చెందిన గొల్ల వెంకటేష్‌కు సర్వే నంబర్ 501లో 19.63 ఎకరాల భూమి ఉండగా ఆన్‌లైన్‌లో 16.28 ఎకరాలు మాత్రమే నమోదు చేశారని, మిగతా 2.25 ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.
- హొళగుంద మండలం వందవాగిలి గ్రామానికి చెందిన వడ్డె హనుమంతమ్మకు సంబంధించి సర్వే నంబర్ 162 హెచ్‌లోని 4.49 ఎకరాలు ఆన్‌లైన్‌లో మిగులు భూమిగా నమోదైందని, విచారణ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ సమర్పించాడు.
- హొళగుంద మండలం కోగిలతోట గ్రామానికి చెందిన ముక్కన్నకు సంబంధించి సర్వే నంబర్ 199/3లోని 2 ఎకరాల భూమి ప్రభుత్వం నుంచి సంక్రమించినదని, ప్రస్తుతం ఆ భూమి హద్దులు చూపాలని అర్జీ సమర్పించాడు.

కార్యాలయ పరిపాలన అధికారి గోవిందొసింగ్, సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ వేణుసూర్య, వ్యవసాయ శాఖ ఏడీ గిరీష్‌కుమార్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతస్‌ప్రియ, మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

ఆదోనిటౌన్: స్పందన కార్యక్రమంలో అర్జీలు సమర్పించడం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయా వార్డులకు సంబంధించిన ప్రజలు పలు సమస్యలపై అర్జీలు ఇచ్చారు. తాగునీటి సమస్య, ఆస్థి పన్ను విధింపు, వెలగని వీధిలైట్లపై ఫిర్యాదు చేశారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని అసిస్టెంట్ కమిషనర్ చెప్పారు. ఇంజనీరింగ్, టీపీఓ, శానిటేషన్, రెవెన్యూ, జనన, మరణ, ఎలక్ట్రికల్ విభాగాలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

28న చలో ఢిల్లీ కార్యక్రమం


ఆదోని సెంట్రల్: రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 28న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎగువన కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న అప్పర్‌భద్ర ప్రాజెక్టు వల్ల రాయలసీమ జిల్లాలకే గాకుండా తెలంగాణ రైతులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. జలాల వాటాలో కేంద్రం న్యాయం చేయాలని కోరారు. నాయకులు రాము, ఆంజనేయులు రామాంజిని తదితరులు పాల్గొన్నారు.


పిల్లలను బడిలో చేర్పించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ మొయినుద్దీన్

కోసిగి: బడి బయట ఉన్న పిల్లలందరినీ బడిలో చేర్పించాలని ఎంఈఓ మొయినుద్దీన్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రాప్ అవుట్ అయిన పిల్లలను గుర్తించి వారి వయస్సు ఆధారంగా తరగతిలో చేర్పించే బాధ్యత పాఠశాల హెచ్‌ఎంలు తీసుకోవాలన్నారు. 5వ తరగతి పూర్తి చేసిన వారిని హైస్కూల్‌లో చేర్పించాలని, 10వ తరగతి పాస్ అయిన వారిని కళాశాలలో చేర్పించాలని ఆదేశించారు. అలాగే 10వ తరగతి ఫెయిల్ అయిన వారిని మళ్లీ పదిలో చేర్పించుకోవాలని, అలాంటి విద్యార్థులకు ప్రభుత్వం అమ్మ ఒడి వర్తింప జేస్తోందన్నారు. బడి బయట పిల్లల వివరాలు గ్రామ వలంటీర్ల మ్యాపింగ్‌లో ఉంటుందని వెల్ఫేర్ అసిస్టెంట్, ఉపాధ్యాయులు సమన్వయంతో పాఠశాలలో చేర్పించాలని చెప్పారు. ఎంఈఓ–2 నాగేశప్ప, సీఆర్‌పీలు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అలరించిన దేహ దారుఢ్య పోటీలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు


పోటీలో పాల్గొన్న బాడీ బిల్డర్లు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని జపాలీ జిమ్ వార్షికోత్సవం సందర్భంగా బాడీబిల్డర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో బెంచ్‌ప్రెస్, బాడీ బిల్డర్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 78 మంది యువకులు పాల్గొన్నారు. బెంచ్‌ప్రెస్‌లో ప్రథమ స్థానంలో నంద్యాలకు చెందిన ఈరన్న నిలిచి స్ట్రాంగ్ మ్యాన్ అవార్డు పొందాడు. బాడీ బిల్డర్ పోటీల్లో నంద్యాలకు చెందిన శ్యామ్ భరత్ మిస్టర్ కర్నూలు అవార్డు సాధించారు. హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో యువకులు సత్తా చాటారని అసోసియేషన్ చైర్మన్ కునిగిరి నీలకంఠ, నిర్వాహకులు సాకరే శ్రీనివాసులు అన్నారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా వెంకటేష్, గోవిందు, పుల్లయ్య, హనుమంతు వ్యవహరించారు. నిర్వాహకులు సురేష్, లోకేష్, హనుమంతు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో సకల సౌకర్యాలు


టిడ్కో కాలనీలో వసతులపై లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్: ఆదోని టిడ్కో గృహ సముదాయంలో ప్రజలు నివాసం ఉండేందుకు మౌలిక సౌకర్యాలు కల్పించామని, లబ్ధిదారులు వారికి కేటాయించిన ఇళ్లలో చేరాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణ శివారు సిరుగుప్ప చెక్‌పోస్టు సమీపంలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాన్ని ఎమ్మెల్యే, కమిషనర్ రఘునాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సందర్శించారు. లబ్ధిదారులతో కలిసి గృహాలను పరిశీలించారు. ఇళ్లలోకి వెళ్లి వసతులపై ఆరా తీశారు. గృహాలకు విద్యుత్, తాగునీటి వసతి, రోడ్లు, కాలువలు, బడి, గుడి, ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాట్లను పరిశీలించారు. లబ్ధిదారుల అవసరం మేరకు వసతులు కలిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 4,720 మంది లబ్ధిదారులు ఇళ్లల్లో చేరితే మరో ఊరు ఏర్పాటవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న రాద్ధాంతాలు, అసత్య ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పట్టణాధ్యక్షుడు దేవా, నాయకులు ఇంతియాజ్, వసీం, మహ్మద్‌స్వామి, లక్ష్మన్న, బి.లక్ష్మన్న, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, రామలింగేశ్వర యాదవ్, చిన్నా, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ఆదోనిఅర్బన్: విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి సూచించారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'స్కిల్‌హబ్–నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్' ఎస్సీ బాలుర హాస్టల్‌లో నిర్వహించిన శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మధుసూదన్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ.. స్కిల్ హబ్ కార్యక్రమాల ద్వారా నైపుణ్యం పెంచుకుని ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత్‌రెడ్డి, ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ బి.శాంత, వార్డు కౌన్సిలర్లు చిన్నా, రామలింగేశ్వరయాదవ్, జిల్లా డాక్టర్ల సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి, నాయకులు పంపాపతి, కామాక్షి తిమ్మప్ప, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'జగనన్న సురక్ష'

కౌతాళం: మండల కేంద్రంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ కౌతాళం సచివాలయం –1కు సంబంధించిన వారందరికి స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరిగే సభలో సర్టిఫికెట్లు అందజేస్తామని, అలాగే సమస్యలను కూడా సభ దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. సచివాలయం –2కు సంబంధించి తహసీల్దారు కార్యాలయం ఆవరణలో తహసీల్దారు అధ్యక్షతన నిర్వహిస్తారని పేర్కొన్నారు.

మణిపూర్ ఘటనలపై చర్యలు తీసుకోవాలి

మంత్రాలయం రూరల్: మణిపూర్ ఘటనల్లో కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఆ రాష్ట్రం రాష్ట్రపతి పాలన విధించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మణిపూర్‌లో 80 రోజులుగా కుకి తెగలపై దాడిచేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. అంతేకాక అత్యాచారాలు, హత్యలు చేస్తున్న వర్గాన్ని వెనకేసుకోస్తుందని ఆరోపించారు. నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామతీర్థం, డీబీఎస్ జిల్లా అధ్యక్షుడు లోకేష్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు, సీపీఐ నాయకుడుభాస్కర్‌యాదవ్, ఆర్‌పీవీఎఫ్ డివిజన్ అధ్యక్షుడు మోహన్ పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం

ఆదోని సెంట్రల్: డివిజన్ వ్యాప్తంగా 2023 విద్యా సంవత్సరం జూనియర్ ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ఈ నెల 26వ తేదీన సాయంత్రం 5 గంటలకు మాస్టర్ మైండ్స్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించనున్నట్లు ఆ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ గ్రూపులో 430కు పైగా మార్కులు, బైపీసీలో 400కు పైగా, ఎంఈసీలో 470కు పైగా, సీఈసీలో 450కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించి నగదు ప్రోత్సాహకం అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు వారి గుర్తింపు కార్డు, కళాశాల ఐడీ కార్డు, మార్కుల జాబితా (ఇంటర్నెట్ కాపీ) తీసుకొని రావాలని సూచించారు. వివరాలకు 92487 22218, 63032 93445 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

మహిళకు గాయాలు

ఆదోనిఅర్బన్: మండలంలోని కుప్పగల్ గ్రామానికి చెందిన సరోజమ్మ సోమవారం వంట చేస్తుండగా వేడి నూనె మీద పడడంతో గాయాలపాలైంది. బంధువులు వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని సెంట్రల్: ఇటీవల బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు జూన్ మాసం జీతం చెల్లించాలని ఎస్టీయూ నాయకులు కోరారు. సోమవారం ఎస్టీయూ భవనంలో మండల ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు అధ్యక్షతన ఎస్టీయూ కార్యకర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఉపాధ్యాయుల పని సర్దుబాటు విషయంలో అన్ని సంఘాలతో చర్చించి అమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ నరసింహులు మాట్లాడుతూ క్యాడర్ స్ట్రెంత్‌ను వెంటనే పూర్తి చేసి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు అటంకం కలగకుండా జీతాలు చెల్లించాలన్నారు. సీనియర్ నాయకులు మహదేవప్ప, ఈరన్నగౌడ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ఆదోనిఅర్బన్: మండలంలోని సంతకూడ్లూరు గ్రామ సమీపంలో ఆటోను లారీ ఢీకొనడంతో పట్టణానికి చెందిన ఐదుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 ద్వారా ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మహేంద్ర, మహ్మద్, షేక్షావలితో పాటు మరో ఇద్దరు ఆటోలో సిరుగుప్ప నుంచి ఆదోనికి వస్తుండగా సంతెకూడ్లూరు సమీపంలో లారీ ఢీకొట్టిందని బాధితులు తెలిపారు.


గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణం న్యూ గాంధీనగర్ కాలనీలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి టి.వీరేష్ కోరారు. ఈ మేరకు సోమవారం పురపాలక అసిస్టెంట్ కమిషనర్ అనుపమను కలసి వినతిపత్రం సమర్పించారు. కాలనీలో 600 కుటుంబాలు నివశిస్తున్నాయని వారి సౌకర్యార్థం ఖాళీగా ఉన్న ప్రభుత్వ పాఠశాలపై భవనంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కోరారు. డీహెచ్‌పీఎస్ జిల్లా సమితి సభ్యులు విజయ్, పట్టణ అధ్యక్షులు వంశీ, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పెద్దకడబూరు: మండలంలోని చిన్నకడబూరు గ్రామ శివారులోనున్న కొండల్లో పేకాడుతున్న ఆరుగురిని ఎస్‌ఐ మహేష్‌కుమార్ సోమవారం అరెస్టు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన చిన్న ఈరన్న, గూని రామాంజనేయులు, కంపాటి లక్ష్మన్న, మొట్రు రాముడు, గొట్టమ్మ గారి హనుమంతు, ఎల్లిపాయల బోజరాజు పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేసి ఆరుగురుని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 25,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కొలువుదీరిన పీర్లు


కోసిగి పెద్ద మసీదు వద్ద చావిడిలో కొలువుదీరిన పీర్లు


పీరును ఊరేగిస్తున్న దృశ్యం

కోసిగి: మొహర్రం పూజలు గ్రామాల్లో ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామ చావిళ్లలో పీర్లను కొలువుంచారు. ఈ సందర్భంగా చావిళ్లను సుందరంగా ముస్తాబు చేశారు.ఆదివారం రాత్రి చావిడి నిర్వాహకులు ప్రత్యేక ఫాతెహాలు చేసి, మేళతాళాల మధ్య పీర్లను కొలువుంచారు. స్థానిక పెద్ద మజీద్, కుమ్మరి వీధి, నూరాణి సున్నీ మజీద్ సమీపంలోని చావిళ్లలో పీర్లు కొలువుతీరారు.

కౌతాళం: స్థానిక ముల్లార్ వీదిలోనున్న చావిడిలో కొలువుదీర్చనున్న హసన్, హుసేన్ పీర్లను సోమవారం గ్రామంలో ఊరేగించారు. పీర్ల ప్రతిమలు పాతవి కావడంతో వాటిని మరమ్మతులు చేసి నూతనంగా తయారు చేయించడంతో గ్రామంలో ఊరేగించినట్లు నిర్వహకులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

వెల్దుర్తి: రైతులు ఆరోగ్యకరమైన ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా ప్రోత్సహించాలని, అందుకు అవసరమైన సాంకేతికతను అందించాలని ప్రకృతి వ్యవసాయ శాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ చంద్రశేఖర్ సూచించారు. ఆయన సోమవారం ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సందీప్‌కుమార్‌తో కలిసి మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో రైతు పరమేశ్ పొలంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రయోగాత్మకంగా వివరించారు. రైతులు వ్యవసాయంలో సొంత నిర్ణయాలు తీసుకునేలా పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. విత్తు దశ నుంచి పంట కాలం పూర్తయ్యే వరకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి, ఆరోగ్యకర దిగుబడులు పొందడం ద్వారా లాభాలు ఆర్జించాలన్నారు. ఆ శాఖ మాస్టర్ ట్రైనర్స్ మల్లికార్జున, వెంకటేశ్వర్లు, పరమేశ్వరుడు, చిట్టెమ్మ, రైతులు పాల్గొన్నారు.